క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



పుస్తకాన్ని అందజేస్తున్న దత్తాత్రేయ

బౌద్ధనగర్: డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణి, రవిప్రసాద్‌గౌడ్, మద్దెర్ల శ్యామ్ సుందర్ సోమవారం ఉన్నారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ తాను రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' అనే పుస్తకాన్ని వారికి అందజేశారు.

బీసీల రిజర్వేషన్‌పై హర్షం



కుమార్ వంశీరాజ్

అడ్డగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ చేసేలా అడుగు వేయడం హర్షణీయమని శాంతినగర్‌కు చెందిన సీనియర్ నాయకులు కుమార్ వంశీరాజ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బీసీలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి వివిధ రాజకీయ పార్టీలలో సేవలందించిన ఎంతో మంది బీసీ బిడ్డలకు ఈ రిజర్వేషన్ అమలు ఎంతో ఉపయోగకరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు అన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



కల్యాణి, హర్షిక

బౌద్ధనగర్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన తల్లీకూతుళ్లు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీత వివరాల ప్రకారం.. వారాసీగూడలోని అంబర్‌నగర్‌కు చెందిన విక్రయ్, కల్యాణి(24)లు దంపతులు. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. కుటుంబ కలహాల కారణంగా కల్యాణి తన కూతురిని తీసుకొని ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. విక్రయ్ పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికి, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తీన్మార్ మల్లన్నపై ఏసీపీకి ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జాగృతి విద్యార్థి నేతలు, ఓయూ విద్యార్థి నాయకులు మండిపడ్డారు. సోమవారం జాగృతి రాష్ట్ర నాయకుడు కందుల మధు ఆధ్వర్యంలో మల్లన్నపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఓయూ ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత పై అనుచిత వ్యాఖ్యలకు క్యూ న్యూస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్యకర్తలపై మల్లన్న గన్‌మెన్ కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంలో జరిగిన సంఘనపై విచారణ చేపట్టి మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఓయూ విద్యార్థి నేత రామకృష్ణ డిమాండ్ చేశారు.

'దోస్త్' గడువును పొడిగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు దోస్తు గడువును పొడిగించాలని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్, దోస్తు కన్వీనర్ ప్రొ.బాల కిష్టారెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ సోమవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరానికి దోస్తు ప్రవేశాల గడువును ఎంసెట్-2025 కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. ఆగస్టు మొదటి వారం వరకు ఎంసెట్-2025 చివరి విడత కౌన్సెలింగ్ ఉందని అందులో సీటు లభించని విద్యార్థులు డిగ్రీ చదివేందుకు దోస్తు ప్రవేశాల గడువును పెంచాలని విజ్ఞప్తి చేశామన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.29, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 77, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 75, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 26, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



ప్రతి నీటి బొట్టు.. ఇంకేటట్టు

ఇంకుడుగుంతల ఏర్పాట్లపై అవగాహన

- 6,932 ఇళ్లకు ఇంకుడు గుంతలు లేవని నిర్ధారణ
- ఆయా ఇళ్లల్లో ఏర్పాటుకు కసరత్తు



సనత్‌నగర్: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి నెల రోజులవుతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో ట్యాంకర్ల డిమాండ్ తగ్గలేదు. ప్రతియేటా ఈ సమయానికి విస్తృతంగా వానలు పడడంతో వాటర్‌వర్క్స్ ట్యాంకర్లపై డిమాండ్ కూడా తగ్గేది. కానీ ఈ సారి 80 శాతం ట్యాంకర్ల బుకింగ్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎందుకంటే ఈ పాటికే రీఛార్జ్ కావాల్సిన బోర్లు ఇంకా నోరెళ్లబెట్టే ఉన్నాయి. అడపాదడపా వర్షాలు పడుతున్నా సరే బోర్లకు సరిపడా నీరు ఇంకా అందనేలేదు. దీంతో వేసవి డిమాండ్ తరహా ఇప్పటికీ ట్యాంకర్ల బుకింగ్ కొనసాగుతూనే ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలసిరి మరింతగా అడుగంటిపోయే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో కాంక్రీట్ జంగిల్‌గా మారిన మహానగరంలో భూగర్భ నీటి మట్టాన్ని పెంచే మహోత్తర కార్యం ఏదైనా ఉదంటే ఇంకుడుగుంతల నిర్మాణమే. ఔను..నీరు ఇంకే జాగాలు లేక వరదనీరు డ్రైనేజీలు పాలైపోతుండడం తెలిసిందే. అలా కాకుండా వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ఇంకుడుగుంతలు నిర్మించడంపై దృష్టిపెట్టాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు. ప్రత్యక్ష కార్యాచరణలోకి దిగి అధికార యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి నీటి ఇంకుడుగుంతల ఏర్పాటు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే ఫతేనగర్, ఎస్సార్‌నగర్, సోమాజిగూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, ఎస్పీఆర్‌హిల్స్, ఎల్లారెడ్డిగూడ, బోరబండ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా సెక్షన్ పరిధిలో జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు, డీజీఎం వంశీకృష్ణ, పర్యవేక్షణలో ఆయా సెక్షన్ల మేనేజర్లు, ఇతర సాంకేతిక సిబ్బంది పర్యటించి ఇంకుడుగుంతల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

పునరుద్ధరణ చర్యలు..

ఒకవైపు వ్యక్తిగతంగా ఇంకుడుగుంతల నిర్మాణానికి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మరోవైపు గతంలో వాటర్‌వర్క్స్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇంకుడుగుంతలకు పునరుజ్జీవం కల్పించే చర్యలకు శ్రీకారం చుట్టారు. డివిజన్-6 పరిధిలో ఉన్న 154 ఇంకుడు గుంతల్లో ఇప్పటికే 140 గుంతలను పునరుద్ధరించారు. గుంతల్లో పేరుకుపోయిన చెత్త, రాళ్లను తొలగించడం, అందులో కొంతమేర ఇసుక నింపడం, వర్షపునీరు ప్రవహించేలా చుట్టూ చదును చేయడం, ఇంకుడు గుంతకు రంగు వేయడం చేస్తున్నారు. సాధారణ ఇంకుడుగుంతల కాకుండా లోతుగా బోరు వేయడం ద్వారా డీప్ లేయర్ హార్వెస్టింగ్ (ఇంజక్షన్ బోర్‌వెల్) గుంతలను ఏర్పాటు చేయనున్నామని, ఇలాంటి గుంతల్లోకి పెద్ద మొత్తంలో నీరు చేరి భూగర్భ జలాల వృద్ధి అయ్యే అవకాశం ఉందని వాటర్‌వర్క్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఉండేలా..

300 గజాలకు పైగా స్థలం ఉన్న ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. ముందుగా ఆయా ఇళ్లను గుర్తించి ఇంకుడుగుంతల అవసరం గురించి వివరిస్తున్నారు. అవసరమైన వారికి సాంకేతిక సహకారం అందజేస్తున్నారు. అయితే ఇంకుడుగుంతల పట్ల ఆసక్తి చూపని వారికి రెండో దశలో నోటీసులు జారీ చేయనున్నారు. అయినప్పటికీ ఇంకుడుగుంతలను తవ్వించకపోతే మూడో దశలో నీటి, సీవరేజీ ఛార్జీలను రెట్టింపు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇంత జరిగినా ఇంకుడుగుంతలను తవ్వించిన ఇళ్లకు నాలుగో దశలో నీటి సరఫరా, సీవరేజీ కనెక్షన్లను తొలగించేందుకు సైతం రంగం సిద్ధం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తూ..

జల మండలి డివిజన్-6 పరిధిలోని 12 సెక్షన్ల పరిధిలో 300 గజాలకు పైగా విస్తీర్ణానికి పైగా 7,092 ఇళ్లు ఉన్నట్లు ఇటీవల అధికారులు నిర్వహించిన సర్వేలో గుర్తించారు. వీటిలో 6,932 ఇళ్లకు ఇంకుడు గుంతలు లేవని తేల్చారు. ఆయా ఇళ్ల యజమానులను కలిసి ఇంకుడుగుంతల ప్రాధాన్యతను వివరించగా 5,184 మంది యజమానులు ఇంకుడుగుంతలను తవ్వించేందుకు అంగీకరించారని, మరో 1500 మందిని గుంతలను తవ్వించడం కోసం ఒప్పిస్తామని వాటర్‌వర్క్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షల టైంటేబుల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: సీపీగేట్-2025 పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షల టైంటేబుల్‌ను సోమవారం విడుదల చేశారు. ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ, పీజీ డిప్లొమా, ఐదేళ్ల పీజీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆగస్టు 4 నుంచి ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి తెలిపారు. పరీక్షల ప్రారంభానికి వారం రోజుల ముందు నుంచి హాల్ టికెట్లను జారీ చేయనున్నారు. ప్రతి రోజు మూడు విడతలు జరిగే పరీక్షలు ఆగస్టు 11న ముగియనున్నాయి. దరఖాస్తులను ఈ నెల 17 వరకు స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు.

మద్యం తాగి బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు

చిలకలగూడ: మద్యం తాగి కాలేజీ బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదైన ఘటన చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి చౌరస్తాలో సోమవారం ఉదయం స్కూలు, కాలేజీ బస్సులపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష నిర్వహించగా మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది. తాను సోమవారం ఉదయం మద్యం తాగలేదని ఆదివారం రాత్రి కొంత మోతాదులో తాగినట్లు డ్రైవర్ వాపోయాడు. టెస్ట్‌లో 36 బీపీసీ(బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్) రావడంతో బస్సును సీజ్ చేసి ఠాణాకు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, ఆయా కాలేజీ, స్కూలు యాజమాన్యాలు బస్సు డ్రైవర్లకు మరింత అవగాహన కల్పించాలని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సూచించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజు, సిబ్బంది యాదవరెడ్డి, రాజులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎఫ్ పనులకు ఆటంకాలు వద్దు

- ఎమ్మెల్యే శ్రీగణేశ్



సీఈఓ మధుకర్ నాయక్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) ద్వారా చేపట్టే పనులకు బోర్డు నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సిందేనంటూ కొత్తగా నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. ఈ నిబంధన వల్ల అధికారుల మధ్య సమన్వయ లోపం, ఇతరత్రా కారణాలతో పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం సేకరించిన కంటోన్మెంట్ భూముల పరిహారం రూ.303 కోట్లతో కంటోన్మెంట్ పరిధిలోని ఓపెన్ నాలాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలన్నారు. ప్రతిపాదిత పికెట్ - ప్యాటీ, హస్మత్‌పేట నాలాలతో పాటు మర్రి రాంరెడ్డి కాలనీ మీదుగా రామన్నకుంటకు చేరే ఓపెన్ నాలాను సైతం అభివృద్ధి చేయాలని కోరారు. మడ్‌ఫోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు స్థల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ మేరకు బోర్డు తీర్మానం ప్రతులను స్పోర్ట్స్ అథారిటీకి అందజేయాలన్నారు.

35 వేల ఓట్లను తొలగించడం అన్యాయం



మాట్లాడుతున్న క్రిశాంక్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో తొలగించిన సుమారు 35 వేల ఓట్లను తిరిగి జాబితాలో చేర్చే వరకు ప్రజలతో కలిసి పోరాడుతామని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నే క్రిశాంక్ అన్నారు. సోమవారం బోర్డు రెండవ వార్డు రసూల్‌పురా ఇందిరమ్మనగర్ బస్తీలో ఓట్లు కోల్పోయిన ప్రజలతో సమావేశమయ్యారు. రక్షణశాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ భూముల్లో గత 50 ఏళ్లుగా పేదలు నివాసముంటున్నారని వారు విద్యుత్, నీటి, ఇతర బిల్లులు కడుతున్నారని కంటోన్మెంట్ బోర్డు అధికారులు సైతం వారికి ఇంటి నంబర్లు కేటాయించారన్నారు. అన్ని విధాల పన్నులు కడుతున్న ప్రజలకు ఓటు హక్కు ఎంతో విలువైందని అలాంటి ఓటు హక్కును తొలగించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు. గత పదేళ్లుగా కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు నిర్వహించక పోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా పరిహారం ఇచ్చిన రూ.303 కోట్ల సొమ్మును తామే తెచ్చినట్లు బీజేపీ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కారిడార్ నిర్మాణ పనుల ప్రతిపాదనలను బీఆర్ఎస్ హయంలోనే రూపొందించిన విషయం మరవొద్దని హితవు పలికారు. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కేంద్ర రక్షణ శాఖ నుంచి రూ.750 కోట్ల సర్వీస్ చార్జీలు విడుదల అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని దానిపై బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు యాసిన్ జంగిల్‌రాజు ఇతర నేతలు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ డీసీగా ఆంజనేయులు

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా .ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీసీ విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన సుభాష్ రావు స్థానంలో ఆంజనేయులు చేరారు. డీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులును సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు హేమలత, సంధ్యారాణి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నివాస భవనంలో వాణిజ్య కార్యకలాపాల నిర్వహణ

జీహెచ్‌ఎంసీకి స్థానికుల ఫిర్యాదు

అమీర్‌పేట: నివాస భవనంలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తూ ఓ వ్యక్తి కాలనీలో సమస్యలు సృష్టిస్తున్నాడని అమీర్‌పేట లీలానగర్ వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు.లీలానగర్ కమ్యూనిటీహాల్‌కు వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి నివాస అనుమతులు తీసుకుని నిర్మించిన భవనంలో వాణిజ్య పరమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కాలనీకి చెందిన సుభాష్ చంద్రారెడ్డి ఆరోపించాడు. నిత్యం వందలాది మంది రాకపోలకు సాగిస్తున్నారని దీంతో శబ్ద కాలుష్యటం ఏర్పడుతుందన్నారు. గతంలోనూ జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని సోమవారం మరోసారి ఫిర్యాదు చేశామన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై సవతి తల్లి ప్రేమ'

కాచిగూడ: బీసీ రిజర్వేషన్ల పట్ల రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపుతోందని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి ఆరోపించారు. కాచిగూడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా బిల్ పాస్ చేస్తూ రాష్ట్రపతికి పంపినప్పటికీ కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని అన్నారు.

మూడేళ్లుగా మొర పెట్టుకుంటున్నా తీరని నీటి సమస్య!



నీటి సమస్యను అడిగి తెలుసుకుంటున్న డీజీఎం విద్యాసాగర్

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లో ఏళ్ల తరబడి లో ప్రెషర్ నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని వర్షాకాలంలో సైతం నీటి ఎద్దడితో సతమతమవుతున్నామని వివిధ బస్తీవాసులు వాపోతున్నారు. ఏ.బీ.డీ సెక్షన్లతో పాటు పలు ప్రాంతాల్లో నీటి సరఫరా కాగానే 15 నిమిషాల వరకు గాలి ప్రెజర్ తప్ప నీళ్లు రావడం లేదని ఆ తర్వాత వచ్చే నీళ్లు కూడా లో ప్రెషర్‌తో వస్తుండడంతో సరిపోక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అసలే లో ప్రెషర్ సమస్య ఉంటే ఇంకొక వైపు జల మండలి సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా నీటి సరఫరా చేస్తారని, దీంతో ఎప్పుడు నీళ్లు వస్తాయో కూడా తెలియని పరిస్థి ఉందని స్థానికులు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడేళ్లుగా మొర పెట్టుకుంటున్నా సెక్షన్ మేనేజర్ తీరు మారడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నీటి సరఫరాలో వస్తున్న సమస్యలు మా దృష్టికి వచ్చాయని ఎత్తైన ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. లో ప్రెషర్ సమస్య ఎదురవుతున్న ప్రాంతంలో నీటి సరఫరాను పరిశీలించామని శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జలమండలి డీజీఎం విద్యాసాగర్ హామీ ఇచ్చారు.

ప్రశాంత వాతావరణంలో బోనాలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి

బౌద్ధనగర్: బోనాల పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా సహకరించాలని వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆలయ, ఫలహార బండ్ల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలన్నారు. ఊరేగింపుల్లో డీజేలు, ప్యాడ్ బ్యాండ్లకు అనుమతులు లేదని గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇవ్వాలన్నారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కనుల పండువగా ఫలహారపు బండ్ల ఊరేగింపు



బన్సీలాల్‌పేట్: చారిత్రాత్మకమైన శ్రీ ఉజ్జయినీ మహాంకాళి బోనాల వేడుకల్లో రెండవ రోజైన సోమవారం అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు కనుల పండువగా సాగాయి. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ నేతృత్వంలో టకార బస్తీ, బండిమేట్, రెజిమెంటల్ బజార్, రాణిగంజ్, ఓల్డ్‌బోయిగూడ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపులు వైభవంగా సాగింది. మోండా మార్కెట్, ఓల్డ్‌బోయిగూడ, గాస్‌మండి, బన్సీలాల్‌పేట్, రాణిగంజ్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 30కి పైగా ఫలహారపు బండ్ల ఊరేగింపు సాగింది. మోండా హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఫలహారపు బండి ఊరేగింపును ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ ప్రారంభించారు.

'మున్నూరుకాపు ట్రస్ట్' అభివృద్ధికి కృషి

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు అభివృద్ధికి, మున్నూరుకాపుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ట్రస్ట్‌బోర్డు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ దడువై రాఘవేందర్ అన్నారు. సోమవారం కాచిగూడలోని కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ బోర్డు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ ఎనుగుల మాణిక్ ప్రభు, మోర సంపత్, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు, దాతలు ఆకుల పాండురంగరావు, మంద సూర్యప్రకాష్, దడువై రాధకృష్ణ, ఎనుగుల వెంకట్ పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ డీడ్‌కు అనుగుణంగా మున్నూరుకాపు విద్యార్థులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ట్రస్ట్‌బోర్డుకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఈఓగా ఎస్.అంజనారెడ్డిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని తెలిపారు.

బోనాల జాతరకు పటిష్ట బందోబస్తు



పూజల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు



లాలాపేట పోచమ్మ దేవాలయం వద్ద పోలీసు అధికారులు

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ బోనాల జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డిలతో కలిసి సోమవారం చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ నెల 20,21 తేదీల్లో జరిగే చిలకలగూడ బోనాలు, రంగం కార్యక్రమాలకు సుమారు రెండు లక్షల మంది భక్తుల వస్తారని అందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయనున్నట్లు వివరించారు. మహిళలు, సాధారణ భక్తుల క్యూలైన్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, స్వాగత వేదికల ఏర్పాటు తదితర అంశాలపై ఆలయ నిర్వాహకులతో చర్చించారు. అనంతరం కట్టమైసమ్మ, నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఈఓ మహేందర్‌గౌడ్, ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, సభ్యులు దేవేందర్‌యాదవ్, అమృత్, జగన్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు జలంధర్‌రెడ్డి, ఆకారం రమేష్, కాసరబాద వెంకటేష్, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు ..

లాలాపేట: బోనాల నేపథ్యంలో అమ్మవారి దేవాలయాలకు దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలనీ ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. ఈ మేరకు పలువురు పోలీసు అధికారులతో కలిసి సోమవారం లాలాపేటలోని పోచమ్మ దేవాలయాన్ని సందర్శించారు. పండుగ ఏర్పాట్లపై దేవాలయ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శషాంక్ రెడ్డి, లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు పాల్గొన్నారు.